సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతులను నట్టేటా ముంచిన రేవంత్ సర్కార్

- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

అంతర్గాం, అక్టోబర్20: కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే.. రైతుబంధు పథకం అమలు చేయకుండా రైతులను నట్టేటా ముంచిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశారు. అనంతరం చందర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ, తొలి సీఎం కేసీఆర్ పాలన యావత్తు రైతాంగం రాజులుగా బతికారని.. కాంగ్రెస్ పాలనలో వారికి మళ్లీ కష్టాలు, కన్నీళ్లు తప్పడం లేదన్నారు. రైతు భరోసాపై మంత్రి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. అబద్ధపు హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు చేసేదాకా పోరాడుతానన్నారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, మాజీ వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మీ మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు బండారి ప్రవీణ్, మేరుగు పోచం, ధర్ని రాజేశ్, సందేళ్ల మల్లయ్య, అర్శనపెల్లి శ్రీనివాస్, గంగాధరి రామన్న, కొలిపాక మధుకర్, కార్పొరేటర్ కృష్ణవేణి, నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, మారుతి, తోకల రమేశ్, రాజు, రాజిరెడ్డి, సట్టు శ్రీనివాస్, ముద్దసాని సంధ్యారెడ్డి, సమరం, అజహరుద్దీన్, కాంపెల్లి సంతోష్, రాజేశ్, సారయ్య, శ్రీకాంత్, ప్రశాంత్ ఉన్నారు.

సరస్వతీ పుత్రుడికి సాయం చేయండి

- నీట్‌లో ప్రతిభ చూపిన ఓడేడ్ విద్యార్థి
- విద్యాభ్యాసానికి సాయం చేయాలని వేడుకోలు

అజయ్‌కుమార్

ముత్తారం, అక్టోబర్ 20: ఓడేడు గ్రామానికి చెందిన సముద్రాల అజయ్‌కుమార్ ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపి మెడిసిన్‌లో సీటు సాధించాడు. వీరిది పేద కుటుంబం కావడంతో ఉన్నత విద్యాభ్యాసానికి సాయం చేయాలని సదరు కుటుంబ సభ్యులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ద్వారకపేటకు చెందిన సముద్రాల కుమారస్వామి-లత దంపతులు గ్రామంలో కూలీ పని చేస్తుంటారు. వీరిది పేద కుటుంబం కావడంతో వీరి కుమారుడు అజయ్ కుమార్ ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో తన అమ్మమ్మ-తాతయ్య మెరుగు ఎల్లమ్మ-లింగయ్య వద్ద ఉంటున్నాడు. ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు గ్రామంలో, ఐదు నుంచి పదో తరగతి వరకు మంథని ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో విద్యనుభ్యసించాడు. ఇంటర్‌లో 965 మార్కులు సాధించారు. అజయ్‌కుమార్ నీట్ ఎంట్రెన్స్‌లో స్టేట్ ర్యాంకు 4656, ఆల్ ఇండియా ర్యాంకులో 2,20,590, ఎస్సీ క్యాటగిరిలో 14,764 ర్యాంక్‌తో వనపర్తి, రామగుండం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ సాధించాడు. రామగుండం ప్రభుత్వ కళాశాలలో చదువనున్నాడు. అయితే ఆయన చదువుకు పేదరికం అడ్డువచ్చింది. మెడిసిన్ చదవడానికి ఏడాదికి లక్ష రూపాయలకు పైగా ఖర్చు అవుతుండడంతో చదువు ఇబ్బందిగా మారింది. ఎంతో కష్టపడి చదివి మెడిసిన్ సీట్ సాధించానని.. దాతలు సాయం చేయాలని అజయ్‌తో పాటు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. సాయంచేసే వారు వివరాల కోసం నంబర్‌ను (6309507471) సంప్రదించాలని సూచించారు.

'రైతు భరోసా' ఇవ్వాల్సిందే

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- పెద్దపల్లిలో రైతుల కలిసి నిరసన

పెద్దపల్లి, అక్టోబర్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు రైతుభరోసా ఇవ్వాల్సిందే.. రేవంత్‌రెడ్డి సర్కారు మెడలు వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా బీఆర్ఎస్ పార్టీ అలుపెరగని పోరాటం చేస్తుంది.. అని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుభరోసాపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలకు నిరసనగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రైతులు, బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, కమిటీల పేరిట కాలయాపన చేసి ఖరీఫ్ సీజన్ రైతుభరోసాకు ఎగనామం పెట్టి.. రబీ సీజన్‌కు రద్దు చేసి.. మొత్తం మీద రైతు భరోసాకు రేవంత్‌రెడ్డి సర్కారు మంగళం పాడే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రైతు భరోసా ఎకరానికి ₹15వేలు, ₹2లక్షల రుణమాఫీ చేస్తామని రైతులను నమ్మించి దండుకున్నారని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ఎండిగట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల ఇన్‌చార్జ్ బండారి శ్రీనివాస్‌గౌడ్, మండలాధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, మండల యూత్ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, కౌన్సిలర్లు లైసెట్టి భిక్షపతి, పూదరి చంద్రశేఖర్, నాయకులు పెంచాల శ్రీధర్, పెద్ది వెంకటేశ్, ఖదీర్‌ఖాన్, వెన్నం రవీందర్, వడ్డేపల్లి తిరుపతి, పల్లె మధు, సంటి శ్రీనివాస్, జుబేర్, వైద శ్రీనివాస్, మెహబూబ్, లవణ్‌కుమార్, రేండ్ల నాగరాజు, కొంతం రాజయ్య, కొంతం సురేశ్, వరాల సంపత్, ప్రేమ్‌కుమార్, యాకోబ్, కమటం శ్రీధర్, కుక్క మనోజ్, టీవీ శ్రీనివాస్, ముత్యం లక్ష్మణ్ గౌడ్, మేకల కుమార్, ఈదునూరి జైపాల్, మెట్టు సమ్మయ్యగౌడ్, సలేంద్ర శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

జూలపల్లిలో నిరసన తెలుపుతున్న రఘువీర్‌సింగ్, కార్యకర్తలు

'రైతుభరోసా' ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ కుట్ర

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్
- రోడ్డుపై బైఠాయించి నిరసన

జూలపల్లి, అక్టోబర్ 20: రైతు భరోసా ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆందోళన చేస్తున్న కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వారు డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ముమ్మాటికి రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశారపు వెంకటేశం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లోక రవీందర్‌రెడ్డి, నాయకులు కూసుకుంట్ల రాంగోపాల్‌రెడ్డి, లాల్‌మహ్మద్, గొడిశెల రవి, బడుగు ఈశ్వర్, పొలగాని సతీశ్, తొగరు శ్రీనివాస్, పసునూటి శ్రీనివాస్, గాండ్ల చంద్రయ్య, మచ్చ యాదగిరి, పల్లె ప్రసాద్, కన్నం రమేశ్, చొప్పరి శేఖర్, కొత్త శ్రీధర్, లక్కాకుల శ్రీనివాస్, తొంటి రాజేశం, పూరెల్ల గంగయ్య, నారగోని శంకరయ్య, నిట్టు కొమురయ్య, చొప్పరి నర్సింగం, కొత్త రాజు, లంక తిరుపతి, సంకెండ్ల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట విధ్వంసం తగదు

కోల్‌సిటీ, అక్టోబర్ 20: అభివృద్ధి పేరిట విధ్వంసం సృష్టిస్తే న్యాయ పోరాటం చేస్తామని ఓల్డ్ అశోక థియేటర్ చట్టబద్ధ లీజ్ హోల్డర్ వేముల అశోక్ స్పష్టంచేశారు. గోదావరిఖని ఓల్డ్ అశోక్ థియేటర్ ఏరియాలోని మొబైల్ దుకాణాలకు ఈ నెల 15న ఉన్నఫలంగా విద్యుత్ సరఫరాను తొలగించారని, దీనిపై ట్రాన్స్‌కో అధికారులను అడిగితే మేయర్ చెప్పడంతో తొలగించామని సమాధానం ఇచ్చారన్నారు. ఈ విషయమై కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే కూల్చివేతలు చేపట్టడం లేదని వారు చెప్పారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఇలా ఆస్తుల విధ్వంసానికి పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి దుశ్చర్యలను అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ఖండించి బాధితుల పక్షాన అండగా నిలువాలని కోరారు.

అరెస్ట్ చేయాలి

గోదావరిఖని, అక్టోబర్ 20: అన్ని అనుమతులతో ఇంటి నిర్మాణం చేపట్టినా కూడా రూ.3లక్షలు డిమాండ్ చేసిన సింగరేణి ఆర్జీ-1 ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావును వెంటనే అరెస్ట్ చేయాలని బాధితుడు ఆర్నకొండ సదానందం కోరాడు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది పట్టణంలో ఇంటి నిర్మాణం చేపట్టగా, సింగరేణి ఆర్జీ-1 ఎస్టేట్ అధికారి సాంబశివరావు వచ్చి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. ఈ విషయమై గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డికి ఫిర్యాదుచేసినా.. ఇప్పటి వరకు రిమాండ్ చేయలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరాడు.

అ'పూర్వ' సమ్మేళనం

- ఒకేసారి కలుసుకున్న పది బ్యాచ్‌ల ఎస్సెస్సీ విద్యార్థులు

విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి, అక్టోబర్20: బసంత్‌నగర్ ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో 1984-85 నుంచి1993-94 వరకు చదువుకున్న పది బ్యాచ్‌ల ఎస్సెస్సీ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం కనులపండుగాలా జరిగింది. దశాబ్దాల తర్వాత బాల్య స్నేహితులను కలుసుకోవడంతో పట్టరాని సంతోషంతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఒకరినొకరు యోగాక్షేమాలు తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ప్రధానోపాధ్యాయుడు అంజనీప్రసాద్, ఉపాధ్యాయులు లేనోరా, లక్ష్మీనారాయణ, సరోజన, పార్వతీదేవి, సమ్మిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఠాకూర్, తిరుపతి రెడ్డి, జీవన్‌రాజుతోపాటు, ప్రస్తుత హెచ్ఎం గాయిత్రీ, ఎంఈవో విమల, ఇతర ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్ననాటి తీపిగుర్తులను నేమరువేసుకుని, తరగతి గదుల్లో కూర్చుని రోజంతా సందడిగా గడిపారు. అంతకుముందు బసంత్‌నగర్ కోదండరామాలయం నుంచి 10బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు సుమారు 400 మంది భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ దేవీ లక్ష్మీనర్సయ్య, కోశాధికారులు తాటిపాము రమేశ్, కేఎఫ్‌టీ శంకర్, ఆర్ శ్రీనివాస్, కల్వల రామస్వామి, మడిపెల్లి రాజమౌళి, తాజొద్దీన్, మంజులా రెడ్డి, మల్క ప్రభాకర్, తిరుమల, దాడి మహేశ్, తోడేటి రవికుమార్, రమాదేవి, శిరీష, నిర్మల, మల్లేశ్వరి, సరోజ, వీరభద్రం, చిందం శంకర్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు

పోటీలకు ఎంపికైన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

సుల్తానాబాద్, అక్టోబర్ 20: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు స్పోర్ట్స్ ఇన్‌చార్జి సునీల్ తెలిపారు. కళాశాలకు చెందిన ఎం మనీష, ఎం రజిత 600 మీటర్ల పరుగు పందెం, డిస్కస్‌త్రోలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారనీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యున్నత ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

పెద్దపల్లి టౌన్, అక్టోబర్20: పోలీసులు కారణం చెప్పకుండా తన ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని నిరసిస్తూ ఆటో డ్రైవర్ రెహమాన్ ఒంటిపై పెట్రోల్ పోసుకోని పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. ఆదివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు రెహమాన్ పెట్రోల్ సీసాతో వచ్చాడు. తన ఆటోను విడిచిపెట్టాలని.. లేదంటే ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పుంటించుకుంటానని బెదిరింపులకు పూనుకున్నాడు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి పెట్రోల్ సీసాను లాక్కున్నారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లడుతూ, రాత్రి జరిగిన దొంగతనం విషయంలో అనుమానంతో తన ఆటోను పోలీసులు ఎలాంటి కారణం చెప్పకుండా పోలీస్‌స్టేషన్‌లో పెట్టారని, దొంగతనానికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాగా, పోలీసులు రెహమాన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

మూడురోజులపాటు శిబిరాలు

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 20: దివ్యాంగులను ఎంపిక చేసి ఉచితంగా సహాయ ఉపకరణాలు అందజేసేందుకు గానూ అలీంకో సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో మూడురోజుల పాటు ఎంపిక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి పీ వేణుగోపాల్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పెద్దపల్లి ,రామగుండం, మంథని మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టుల పరిధిలో నవంబర్ 5, 6, 7తేదీల్లో వైకల్య నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాల కోసం నంబర్లలో (94408 52495,7013755418) సంప్రదించాలన్నారు. యూడీఐడీ కార్డు లేని వారు వెబ్‌సైట్‌లో (https://www,swavlamban card.gov.in) దరఖాస్తు చేసుకోవాలన్నారు. రసీదు తమ వెంట తీసుకురావాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి కోరారు. ఉదయం 9గంటల నుంచిసాయంత్రం 5వరకు జరిగే శిబిరాలను అర్హులైన దివ్యాంగులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజధి

రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా..



రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్లైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

పాడుపుపై ధరల దెబ్బ

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000 లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

అధిక నిధి ఎలా?

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

ఈక్విటీల్లో పెట్టుబడులు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరిఅని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్లైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, నగదు-బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒక ట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్పకాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

గుర్తుంచుకోండి

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్‌డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మరువద్దు

బిల్లుల భారం తగ్గేదెలా?

క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..

క్రెడిట్ కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

ఈఎంఐల్లోకి మార్చడం

చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది.

బిల్లింగ్ విధానంపై అవగాహన

క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పక తమ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ సైకిల్‌ను తెలుసుకోవాలి. బ్యాంకులు క్రెడిట్-ఫ్రీ పీరియడ్‌ను కల్పిస్తాయి. ఇందులో బకాయిల చెల్లింపునకు 30 రోజుల స్టేట్‌మెంట్ సైకిల్, దానిపై 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటాయి. ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ ఏ తేదీన మొదలవుతుందో చూసుకోవాలి. ఆ తేదీ తర్వాత కొంటే మనకు పేమెంట్‌కు ఎక్కువ సమయం ఉంటుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు బిల్లు డ్యూ డేట్ ఆగస్టు 4న ఉన్నది. ఆ బిల్లు స్టేట్‌మెంట్ జూలై 18న వచ్చింది. అయితే జూలై 19న మీరు మీ క్రెడిట్ కార్డు ద్వారా ఓ వస్తువును కొన్నారు. అప్పుడు అది తర్వాతి బిల్లు స్టేట్‌మెంట్‌లో ఉంటుంది. దాన్నిబట్టి సెప్టెంబర్ 4వరకు మీరు దాని చెల్లింపునకు వ్యవధి ఉంటుందన్నమాట. ఒకవేళ జూలై 17న కొంటే ఆగస్టు 4కల్లా చెల్లించాల్సిందే. రెండ్రోజులు ఆగి కొనడం వల్ల ఇంత లాభం ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండటం వల్ల నగదు సర్దుబాటుకు వీలుంటుంది.

పర్సనల్ లోన్

క్రెడిట్ కార్డు బకాయిలపై పడే వడ్డీరేటు కన్నా.. వ్యక్తిగత రుణాలపై పడే వడ్డీరేటు తక్కువ. కాబట్టి ఎక్కువగా ఉన్న క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించేందుకు పర్సనల్ లోన్ల సహాయం తీసుకోండి. మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే వడ్డీరేటు ఇంకా తగ్గుతుంది. అలాగే మినిమం కంటే ఎక్కువగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లిస్తే మంచిది. అధిక వడ్డీ బకాయిలను ముందుగా చెల్లించాలి. తక్కువ మొత్తాలను తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతకన్నా ముందు అనవసరపు కొనుగోళ్లను తగ్గిస్తే బిల్లుల భారం తగ్గుతుంది.



పీవోఎంఐఎస్ భళా

నెలనెలా ఆదాయాన్ని ఆశించేవారు, సురక్షిత పెట్టుబడులపట్ల ఆసక్తిగలవారు పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం (పీవోఎంఐఎస్)ను పరిశీలించవచ్చు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ఆకర్షణీయ వడ్డీరేటును అందిస్తున్నది. అక్టోబ